# తల్లీ, నిన్ను దలంచి ... !

గౌరీపతి అమెరికాలో దిగేనాటికి ముగ్గురు పిల్లలూ, నాలుగుపదులమీద నాలుగేళ్ల వయసూను. అప్పటికి అతనికి ఇంగ్లీషుభాషమీద గొప్ప అధికారం వున్నా తెలుగంటే అంతకి మించిన ప్రేమ. అతనికి తగ్గట్టే అర్థాంగి సావిత్రి కూడా దొరికింది. ఆవిడకి నూనెవంకాయా, మిరపకాయబజ్జీలూ, పులిహోరా, కొత్తిమీరఖారంలాటి వంటకాలే చేతనవును. వంటా, పిల్లలూ తనబాధ్యత అని గట్టిగా నమ్మిన ఇల్లాలు. వాటన్నటి మూలంగా అతనికి అమెరికాలో ఉన్నా అచ్చం దేశంలోనే మనింట్లోనే ఉన్నట్టే ఉండడం చేత వారి సంసారం విరగబూసిన మందారంలా కన్నులపండువగా గడిచిపోతోంది.

అతనలా జన్మభూమి మీది మమకారాలు మనసులో మననం చేసుకుంటున్న దినాలలోనే వైజాగులో ఉన్న మిత్రుడు భగవంతం చాట్లోకొచ్చి (చాటలో కాదండీ, చాట్) సతాయించేడు ఓమారు రాకూడదా అంటూ. ఓపావుగంట ఘర్షణ పడ్డాక, ''ఏదేనా సభలు ఏర్పాటు చెయ్యి, వస్తాను,'' అన్నాడు గౌరీపతి.

''దానికేంవుంది? భాషాఘోష దిక్కుల పిక్కటిల్లుతోందిక్కడ. ఆరిపోతున్న తెలుగుభాషకి వూపిరి పోసి నిలబెట్టాలని మహ ఆరాటపడి పోతున్నాం అందరం. నువ్వు రా. నీ అమెరికను కనులతో మనదేశం చూసి, నీ అనుభవాలు కూడా చర్చకి పెట్టొచ్చు,'' అన్నాడతను.

''సరే''నన్నాడు గౌరీపతి.

దరిమిలా భగవంతం హుషారుగా ఊళ్లోనూ, విశాఖపట్నంలోనూ, వాల్తేరులోనూ, రాజధానిలోనూ ఉన్న అనేకానేక పెద్దలని కలుసుకుని, అవుననిపించుకుని, తగిన సంభారాలు కూర్చుకునేసరికి మరో రెండేళ్లు గడిచాయి.

అలా మొత్తం ఎనిమిదేళ్ల తరవాత గౌరీపతి మాతృదేశానికి ప్రయాణమయాడు. పెద్దకొడుకు శ్రీను, పెద్దమ్మాయి కవిత అప్పటికి టీనేజరులు. యూరపయితే బావుంటుంది కాని ఇండియాలో ఏముంది ఎంజాయ్ చెయ్యడానికి అన్నారు వాళ్లు. అంచేత, గౌరీపతి సావిత్రితోనూ, ఆఖరి అమ్మాయి జానీతోనూ బంధుజనాలకోసం కొన్న విదేశీ సరుకులతో పాటు కొన్ని పాత జ్ఞాపకాలు కూడా మూట కట్టుకు బయల్దేరేడు.

★

బొంబాయిలో దిగి రైలెక్కి హైదరాబాదులో దిగగానే తొలిషాకు తిన్నాడు గౌరీపతి. ఏడెనిమిదేళ్లలో దేశం ఇంతగా మారిపోగలదని ఎవరైనా అతనితో అని వుంటే, అతను నమ్మి ఉండేవాడు కాడు.

హైదరాబాదు రాజధాని కదా అంతేలే, అని సరిపుచ్చుకుని, మళ్లీ కోణార్కెక్కి, వైజాగులో దిగి, బస్సెక్కి గాజుగాక చేరుకున్నాడు.

అక్కడా అంతే. వూరు మారిపోయింది. కిరసనాయిలు దీపాలకి బదులు చాలామంది ఇళ్లలో కరెంటు దీపాలొచ్చాయి. గుమ్మాలకి పసుపు, కుంకుమలకి బదులు వార్నీషులు వేసుకుంటున్నారిప్పుడు మిద్దె యిళ్లవాళ్లు.

★

వైజాగులో పెద్ద పెట్టున అంతర్జాతీయ తెలుగుభాషోద్ధరణ సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రాలో ఉన్న రాజు గారూ, రెడ్డిగారూ, నాయుడుగారూ, చౌదరిగారే కాక మద్రాసునించి చెట్టి గారూ, బెంగుళూరునించి మూర్తిగారూ, కొల్‌కొటానించి రాయ్‌గారూ, ఇంగ్లండునించి విష్‌గారూ, అమెరికానించి గౌరీపతీ, మరియు పంట్ గారూ, జర్మనీ

నించి చెంగళ్ గారూ కూడా వచ్చారు. అలాగే ఇంకా చాలా దేశాలలో పాతుకుపోయిన భాషాభిమానులు చాలామంది ఆసభలో పాల్గొనడానికి విచ్చేశారు.

''మిస్ అషీమాని కూడా కార్యవర్గంలో చేర్చుకుందాం'' అన్నారు నాయుడు గారు. అషీమా అసలు పేరు చిన్నలక్ష్మీ ప్రసూనాకుమారి. కాని ఆపేరు ఆధునికంగా లేదనీ, అసలు చాలామంది పలకలేరనీ, బెంగలీపేర్లకి గిరాకీ అనీ – ఇలా చాలా కారణాలు వెతుక్కుని, ఆవిడ వాడుకపేరు అషీమా అని మార్చుకుంది. గొప్ప సంఘసంస్కర్తగా ఇప్పుడిప్పుడే జనాల్లో పడుతోంది.

''ఆమెందుకండీ. ఫెమినజమూ గట్రా అంటూ గొడవ లేపుతుంది,'' అన్నాడు చౌదరి.

''ఆ, లేదులెండి. మన మాటినే మనిషే. అదీగాక మనగ్గూడా గవువంచే. మల్ల ఆడాళ్లని వేరెట్టేశాం అనీకండా,'' అన్నాడు చెట్టిగారు.

చెంగళ్ కూడా మంచిపాయింటే అంటూ వత్తాసిచ్చాడు. మరి వారి సంస్థ డెమొక్రటిక్ ప్రిన్స్‌పుల్సుమీద ఏర్పాటయిన సంస్థ. వేరెట్టడాలు వారికి పట్టవు, కులతత్త్వాలంటే మహ మంట. ''ముక్కోటి ఆంధ్రులు ఒక్క జండా నీడ, … చేయెత్తి జైకొట్టు తెలుగోడా'' అంటూ పాడుకుంటున్నవారూ, పాడుకోగలవారూనూ అందరూను. అందుచేత స్త్రీలకి ప్రాతినిధ్యం ఇవ్వవలసిన అగత్యం అందరూ గుర్తించేరు అట్టే శ్రమ లేకుండానే.

కార్యక్రమాలు ఘనంగానే ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో పన్నెండు పేనల్‌లు.

మిస్. ఆషీమా స్త్రీలకి ప్రత్యేకంగా ఒక పేనల్ పెట్టాలనీ, మిగతా అన్ని పేనల్స్‌లోనూ, ఒక స్త్రీ తప్పకుండా ఉండాలనీ ప్రతిపాదించింది.

''అన్ని పేనల్లల్లోనూ పెట్టేంతమంది ఆడవారెక్కడున్నారండీ మనకి.''

''అసలే వాళ్లబుఱ్ఱలు చిన్నవి.''

ఆమాటకి ఆషీమా వురిమి చూసింది, ''అంటే ఏమిటండీ మీ అభిప్రాయం?''

''అది నేనన్నమాట కాదండీ. ఈమధ్య ఎవరో హార్వర్డు ప్రొఫెసరు అన్నారని మరెవరో అన్నారు. నేను హాస్యానికన్నానంతే,'' అన్నాడు చెంగళ్ నవ్వుతూ.

''ఇంతకీ మీ పేనల్స్‌లో స్త్రీలకి ప్రాతినిధ్యం ఇస్తారా ఇవ్వరా?''

''మీరే చెప్పండి, ఏ పేనల్‌లో ఎవర్ని పెడితే బావుంటుందో.''

ఆషీమాకి పెద్ద చిక్కొచ్చిపడింది. ఎవరి పేరు చెప్పినా ఏదో వొక వంక.

''ఆవిడని కిందటేడు పిలిచాం కదా''

''అంతకుముందు పిలిస్తే, వాళ్లాయనకి కూడా ఎయిర్‌ఫేర్సు ఇమ్మంది. ఎక్కడ తెస్తాం?''

''అబ్బే, ఆవిడకి మాటాడడం చేతకాదు.''

''నో, నో. ఆవిడకి మనవర్కుమీన గవురవం లేదు.''

'' వాటెబౌట్ 'ఫలానా' ఆవిడ?''

''వద్దు బాబోయ్. 'ఫలానా ఆవిడ'ని పిలిస్తే 'ఫలానా'ఆయనతో తగువు! తీరి కూచుని కొరివితో తల గోక్కున్నట్టే.''

ఆషీమాకి ఆయాసం వచ్చింది. రెండు పేనల్స్‌లో ఇద్దరు స్త్రీలని పిలిచే ఏర్పాటుకి ఒప్పందం అయిపోయింది.

★

సభలు ఉన్నతస్థాయిలో మొదలయాయి. రాజధానినుంచి విద్యాశాఖామంత్రిగారు విచ్చేశారు. ఊటీలో స్థిరపడిన తెలుగు ఆస్థానకవి ముఖ్య అతిథి. ఆయన కూడా విద్యాశాఖామంత్రిగారితో సమానంగా రాజలాంఛనాలతో

విమానాలమీద వేంచేశారు. మిగిలిన వ్యక్తులు వారి వారి వీలునుబటి, తాహతులని బట్టి ప్రయాణాలు చేసి, వేంచేశారు.
మొదటిరోజు అసలు తెలుంగులెవరు, తెలుగు అన నేమి, తెలుంగువారి సంప్రదాయాలు ఎలా నెలకొన్నాయి వంటి అనేక విషయాలమీద ఉపన్యాసాలు ఇవ్వబడ్డాయి.''సభికులు ఈరోజు మనం చాలా తెలుసుకున్నాం'' అనుకుని, ఆనందించారు.

రెండోరోజు అకస్మాత్తుగా అవాంతరం వచ్చిపడింది. ఆనాడు సభకి అధ్యక్షత వహించవలసిన పద్మశ్రీ సంపూర్ణాఘోష్ గారు అనారోగ్యం కారణంగా రాలేనని తెలియజేశారు భగవంతానికి అర్ధరాత్రి ఫోన్ చేసి. అతను బహుశా తనఇంట్లో ఫోను ఉన్నందుకు విచారించింది ఆ ఒక్కరోజేనేమో. ఆతరవాత అధ్యక్షులవారిని పిలవడమా వద్దా అని తనలో తనే కొంత తర్జనభర్జన చేసుకుని, నువ్వే ఏదో దారి చూడు అని ఆయన అంటారని తనకి తనే సమాధానం చెప్పుకుని, ఆదారి కనుక్కుని, ఓ దానయ్యని దొరకపుచ్చుకుని, కార్యవర్గం పరువు నిలబెట్టేడు.
మొత్తం మీద వక్తలూ, సభాపతీ సభామండపం అలంకరించేసరికి పది దాటింది. సభికులు వాచీలు చూసుకుంటూ మొదలెట్టు తండ్రీ అన్నట్టు మొహాలెట్టారు. ప్రకటించిన సభాపతి కారణాంతరాలవల్ల రాలేకపోయారని చెప్పి, స్వల్పవ్యవధిలోనే అయినా అంగీకరించినందుకు దానయ్యగారికి కృతజ్ఞతలు చెప్పి, కార్యక్రమం ప్రారంభించారు. దానయ్య లేచి సభాసదులకు నమస్కరించి, ''ఇప్పుడు రాయ్‌గారు మాటాడతారు'' అని చెప్పి, కూర్చున్నాడు.

రాయ్ గారు లేచి, తెలుగు భాష గొప్పదనం గురించి చక్కగా చెప్పారు.
''కన్నడప్రభువు శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అన్నాడు. సార్వభౌములు నన్నయ్యని భారతం తెనిగించమని నియమించడమే కాక తాను స్వయంగా ఆముక్తమాల్యద అను ప్రబంధాన్ని తేటతెలుగులో రచించాడు. ఎందుకని అంటే తెలుగు మధురమయిన భాష కనక. పద్మరాజు గారూ, ఆతరవాత సుబ్రహ్మణ్యశర్మగారూ తమ తెలుగుకథలని తామే ఆంగ్లంలోనికి అనువదించుకుని, న్యూయార్కు హెరాల్డువారు నిర్వహించిన ప్రపంచ కథలపోటీలలో బహుమతులు పొంది, తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని గణించి పెట్టారు. అంటే తెలుగుసాహిత్యం ఘనత మనకి తెలుస్తోంది కదా ... ''
ఆయన ఉపన్యాసం అంతా ఇక్కడ రాయడం అయేపని కాదు కాని ఇదే ధోరణిలో సాగింది ముప్పావుగంట.

ఆతరవాత సింహళనించి వచ్చిన సింగరిగారు తాము విదేశంలో ఉంటూ తెలుగుభాషని ఎలా పోషించుకుంటూ వస్తున్నారో చెప్పారు. ఆయన ఉన్న ఊరిలో ఓ పది తెలుగు కుటుంబాలు ఉన్నాయిట. నెలకొక సారి అందరూ కలుస్తారుట. తెలుగు మాటాడుకోడం, చదువుకోడం చేస్తారుట. అదికాక, ప్రతిఆదివారం ఉదయం ఆరుగంటలకి ఆకాశవాణిలో గంటన్నరసేపు తెలుగు కార్యక్రమం నడుపున్నారుట. అందులో ఒక్క ఆంగ్లపదం కూడా మచ్చుకయినా ఉండదుట.
''నాభాషణలో మీరు ఒక్క ఆంగ్లపదమయిన ఏరోజయిన ఎత్తి చూపగలిగిన, పదివేలరూప్యములు ఇత్తునని ఇదే నా సవాలు. ఈనాడు తెలుగుభాషయందు అభిమానముతో ఇక్కడ చేరిన మీరందరూ సాక్ష్యం. నా హస్తవాహక వాక్ప్రవణయంత్రం సంఖ్య కూడా మీకు ఇవ్వగలను. మీరందరూ తెలుగు మాయమయిపోతూందనీ, తెలుగుభాషని తిరిగి పునరుద్ధరించి నిలబెట్టుకొనవలెననీ అంటున్నారు. మీకు నిజంగా తెలుగుభాషయందు

అభిమానము ఉండిన, ముందు మీరు ఇప్పుడు మాటాడుచున్న సంకరభాషని, ముప్పాది ఆంగ్లపదములతో కూడిన తెలుగుని వదిలిపెట్టుట అవుసరము'' అని చెప్పి ముగించారు.
కార్యకర్తలు మొహాలు చూసుకున్నారు. ఇంతవరకూ తాము ''అట్టి సంకరభాషలోనే మాటాడుచూ ఉంటిమి'' అని అప్పుడే అవగతమయింది వారికి మరి. సరే, ఏం చేయగలరు ఎవరైనా? రోటిలో తల దూర్చేశారు కద, ''సంజయ, ఏమని చెప్పుదు ... '' చందమయింది ఆర్గనైజరుల అవస్థ.

దానయ్యగారు మళ్లీ లేచి, తనభాషణలో ఆంగ్లపదాలు దొర్లకుండా జాగ్రత్త పడుతూ, ఆ తరువాయి వక్త, చెట్టి గారిని ముచ్చటగా మూడు ముక్కల్లో పరిచయం చేసి మాట దక్కించుకున్నాడు. ఆక్షణంలో అతడి మనసు అమందానందకందళితహృదయారవిందయింది ఆనాటిసభలో తాను వక్త కానందుకు!
చెట్టిగారు కూడా కొంచెం తడుముకుంటున్నట్టే కనిపించారు. కాని అంతలోనే తను చర్చించవలసిన విషయం గుర్తుకొచ్చింది.
''అసలు తెలుగు ఆంగ్లపదాలను అంకించుకుని హక్కుభుక్తం చేసేసుకోడానికి ముక్య కారనం మన సాంకేతిక పురోభివృద్ది. ఈనాటి సాంకేతిక పదాలు మనకి తెలుగులో లేనందున. ఒకవేళ మనం తెలుగు పదాలు సమకూర్చుకున్నా అవి అంతర్జాతీయంగా ఎవరికీ అర్తం కావు కనక అవుసరమయిప్పుడు ఇంగ్లషు వాడక తప్పదు. ఉదారణకి వర్డు రెండ్‌వేల్ చూడండి. బచాయించండి (సేవ్), మల్ల బచాయించండి (సేవ్ ఆస్), అంటే తెలంగాణాలో తెలుస్తుందేమో గాని, తెలుగుదేశంలోనే వేరే పూర్లవారికి గందరగోలంగా ఉంటది గంద. అంచేత పుప్పుడు మనం నన్నయ్య, తిక్కనలనాటి తెలుగుమాటలతో పబ్బం గడుపుకోలేం. బాష సజీవం. అంటే పెరుగుతా పోతా వుంటది. అసలు ప్రపంచంలో ఏ బాస మాత్రం మార్పు లేకుండా ఉండిపోయింది గనక? అంతెందుకు, ఈనాటి ఇంగ్లీషులో మన తెలుగు మాటలు ఎన్ని చేరేయో చూడండి – బాడ్ కర్మ, కరీ, నిర్వానా, మసాలా... అంటి మాటలెన్నో ఆంగ్లం అయిపోయినాయా లేదా?''
ఆయన ఉపన్యాసం వింటుంటే గౌరీపతికి దిగులు ముంచుకొచ్చింది. తనకి అర్థం కాలేదు కాబోలనుకుని భగవంతంవేపు చూశాడు. అతను వంచిన తలెత్తకుండా నోట్సు రాసేసుకుంటున్నాడు పొట్టిచేతి(షార్టుహేండు)లో.

ఆతరవాత వక్త పంట్. అతను పుట్టుకతోనే నాయకుడు. దేహ దారుఢ్యంతో పాటు లౌక్యం కూడా అతిచిన్న వయసులోనే సంతరించుకుని అయిదో తరగతి అయేసరికే ఇరుగుపొరుగువారందరిచేతా హౌరా అనిపించుకున్న ప్రబుద్ధుడు. అసలా బుద్ధి అడుగులేస్తూనే వచ్చిందేమో! తప్పటడుగులేస్తూ ఇల్లంతా తిరుగుతుంటే, తనకంటే వయసులో పెద్దే అయినా అతని నేస్తులంతా అతనివెనకనే నడిచేవారుట. అప్పుడే కనిపెట్టేసింది తల్లి తన కొడుకు నాయకుడవుతాడని. ఆనాటినించి ఈనాటివరకూ ఇతరులని నడిపించడమే కాని తాను ఎవరివెనకా నడవలేదు. సభ మొదలయిందగ్గరినించి అతడికి ఇరకాటంగానే ఉంది. తను చెప్పదలుచుకున్న గొప్ప పాయింట్లన్నీ ఈవక్తలందరూ చెప్పేస్తున్నారు. తాను కొత్త విషయం చెప్పాలి. ఏమిటి చెప్పడం? సరే చూద్దాం అనుకుని, తను కూడా తెలుగుభాష పుట్టుపూర్వోత్తరాల దగ్గరే మొదలెట్టి, మనభాష ఘనతా, జాతి ఘనతా ప్రస్తావించి, పొగడరా నీతల్లిభూమి భారతిని అంటూ ఓచరణం పాడి, తెలుగు భాషని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను గూర్చి ప్రస్తావించి, ''మనం ఒక విస్తృతమయిన ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఆ ప్రణాళిక తయారీలో ప్రపంచీకరణని తప్పకుండా గుర్తుంచుకోవాలి'' అంటూ ఆగి సభికుల్ని చూశారు.

సభికులు అలిసిపోయినట్టు కనిపించారు. దివాలా మొహాల్తో వుసూరుమంటూ చూస్తున్నారు. ఎవరిమొహంలోనూ ఉత్సాహం అన్నది మచ్చుకయినా కనిపించడంలేదు. లాభం లేదు, ఏదైనా పదునైన అస్త్రం ప్రయోగించవలసిన సమయం ఆసన్నమయింది అనిపించింది వక్తకి. ఘనతకెక్కిన మహామహులనందరూ తలపుకొచ్చేరు. తేటతెనుగున రాయమన్న రాయలవారినుండీ, వ్యావహారికం వుపయోగించవలెనన్న రామ్మూర్తిగారివరకూ, ఆ తరవాత మాడర్న్ కవిత్వానికి మార్గదర్శకుడు శ్రీశ్రీ … ఆగుడాగుడు. శ్రీశ్రీవారు శాస్త్రిగారికి ఏమని శలవిచ్చారూ? ''తెలుగులో బాగా రాయలంటే ఇంగ్లీషు బాగా చదువుకోవాలి'' అని. శెహభాష్.

పంట్‌గారు జనాలనోమారు కలియజూసి, మళ్లీ పుంజుకున్నాడు, ''మన ప్రపంచీకరణకనుగుణంగా తెలుగుండాలి. అంటే తెలుగుని ఇంగ్లీషుతో కమింగిల్చేసి, పాఠాలు తయారు చేసుకోవాలి. అంటే మనం తెలుగు నేర్చుకోడానికి ముందు ఇంగ్లీషుభాషని క్షుణ్ణంగా అభ్యసించాలి.''

ఈ చివరి వాక్యంతో అంతవరకూ దిక్కులు చూస్తున్న జనాలు, ముఖ్యంగా ఇంగ్లీషుమీడియం స్కూళ్లలో చదువుకున్న తెలుగు యువకులు వులిక్కిపడి, తెలివి తెచ్చుకుని నిటారుగా కూర్చున్నారు, ఎవరో వెన్నుమీద ఛెళ్లున చరిచినట్టు. వాట్ ఎ బ్రిలియంటయిడియా! అన్నారు ముక్తముఖాలతో..

పంట్‌గారికి కావలసింది కూడా అదే. సభికుల దృష్టిని ఆకట్టుకోడం, ఆతరవాత వారికి అర్థమయేలా విడమర్చి చెప్పడం. అదే కదా మంచి వక్త లక్షణం మరి. అంచేత ఆయన ఇంగ్లీషు భాష అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతని గురించి వివరించడం మొదలెట్టారు. ''ఇందాక చెట్టిగారు చెప్పినట్టు సాంకేతికపదజాలంమీద అధికారం రావాలంటే మనకి ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం అవసరం. అసలు మన దేశ చరిత్ర చూడండి. ఇంగ్లీషువాడు మనమీద అధికారం ఎలా సాధించాడు? వాడికి ఇంగ్లీషుభాష కరాతలామలకం కనుక! ఇప్పుడు మనం మళ్లీ ఇంగ్లీషువారిమీద ఆధిపత్యం ఎలా సాధించగలం? వాడి భాష నేర్చుకుని వాడిభాషలోనే వాడిని జయించడంద్వారా. వుమన్ అండ్ చిల్డ్రన్‌కి వాళ్లకి అర్థమయే భాషలోనే బోధ పరిచినట్టుగానే, ఇంగ్లీషువాణ్ణి ఇంగ్లీషులోనే జయించాలి. చెట్టిగారు చెప్పింది ఎంతయినా సబబుగా ఉంది. ఇంగ్లీషు నేర్చుకుంటే, మనకి వారి ఆలోచనాధోరణి అవగతమవుతుంది. మనం ఇంగ్లీషు వ్యాకరణం, పదవిన్నాణం, వాక్యనిర్మాణం --క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అందుకు మనం విదేశాల్లో తెలుగుపిల్లలకి ఇంగ్లీషు స్కూళ్లు పెట్టాలి. ఆస్కూళ్లలో పాఠాలు చెప్పడానికి తెలుగు దేశంలో ఇంగ్లీషుబడిలో తెలుగు నేర్చుకున్నవారిని పిలిపించాలి. అందుకు కావలసిన నిధులు ఏర్పాటు చేయడానికి రాష్ట్రప్రభుత్వం పూనుకోవాలి. …''

మరో పావుగంట తరవాత, సభాపతి చేతనయినంత సంక్షిప్తంగా ఆనాటి వక్తల ఉపన్యాసాలు సమీక్షించి చేతులు దులుపుకున్నాడు.

రాత్రి ప్లినరీసెషను. ఆరెండురోజులసభల్లో జరిగిన చర్చలూ, వచ్చిన ప్రతిపాదనలూ సంగ్రహించి, రకరకాల ప్రతిపాద నలు చేసారు. సింగరిగారి ఉపన్యాసం విన్నతరవాత వారందరికీ ఒక విషయం తేటతెల్లమయిపోయింది. ఆయనలాగా ఇంగ్లీషుపదాలు వాడకుండా తెలుగు మాటాడడం వారిలో ఎవరికీ సాధ్యం కాదు, కాలేదు. పైగా సింగరిగారు కూడా వారానికి గంటన్నర మాత్రమే తెలుగు మాటాడుతున్నారు. తదితర సమయాల్లో తప్పనిసరిగా ఇంగ్లీషు మాటాడుతూనే ఉన్నారు. అందుచేత బేషరతుగా తెలుగు నేర్చుకోడానికి ఇంగ్లీషు ముఖ్యం అని అందరూ అంగీకరించేశారు, సభ్యులు పంట్‌గారి ప్రతిపాదనలు ఏకగ్రీవంగా ఆమోదించేశారు.

- పిల్లలకి తెలుగుకంటె ముందు ఇంగ్లీషు నేర్పాలి.

- అన్ని స్కూళ్లలోనూ విద్యాబోధన తదనుగుణంగా మార్చమని ప్రభుత్వంవారికి వినతి సమర్పించుకోవాలి.
- కోర్సులూ, టెక్స్ట్‌బుక్కులూ తదనుగుణంగా తయారు చేయాలి.
- సినిమాల్లోనూ, పుస్తకాల్లోనూ, పత్రికలలోనూ కూడా కనీసం ఎనభై శాతం ఇంగ్లీషు వాడాలి.
- ఇళ్లలో తప్పనిసరిగా ఇంగ్లీషే మాటాడాలి.
- అమెరికాకి వచ్చే, ఇంగ్లీషు రాని అమ్మ మ్మలూ, నాన్నమ్మలనించి పిల్లలు తెలుగు నేర్చుకుంటారు కనక వాళ్లకి ప్రయాణానికి ముందు విధిగా ఇంగ్లీషుభాష నేర్పే ఏర్పాటు చేయాలి.
- బ్రౌణ్య నిఘంటువు తిరగరాయాలి, బాతు (స్నానం), బూతు, వాకు(అవాకులూ–చెవాకులూ అన్న అర్థంలో కాదు)– వంటి పదజాలం చేర్చి.
- కృష్ణమూర్తిగారు తెలుగు వ్యాకరణం తిరగరాయాలి, వాడుకలో ఉన్న ఆంగ్లపదాలకి తగినట్టు విభక్తిప్రత్యయాలు (చాట్లో, కూల్గా, వెబ్బందు), సర్వనామాలకి తగిన క్రియావాచకాలు (బాత్ చేయు, మెసేజెట్టు, ఆంగ్రీ అవు, కాల్చేయు, సిక్కవు) సోదాహరణంగా నిరూపిస్తూ.
- విదేశాల్లో తెలుగుపిల్లలకోసం ఇంగ్లీషు పాఠశాలలు పెట్టాలి. అందుకు నిధులు సేకరించాలి.
- విదేశాల్లో తెలుగువారికోసం పెట్టిన ఇంగ్లీషుస్కూళ్లలో పాఠాలు నేర్పడానికి తెలుగుదేశంనించి పంతుళ్లని పిలిపించాలి, వారికి మాత్రమే మన సంస్కృతి, మనభాష, మనఇంగ్లీషు తేటతెల్లము కనుక.

భగవంతం జాగ్రత్తగా ప్రతిపాదనలన్నీ రాసుకున్నాడు, తు,చ, తప్పకుండా.

★

ఆరాత్రి భగవంతం గౌరీపతిని అడిగాడు సభలమీద అతని అభిప్రాయం.

గౌరీపతికి చాలా అసంతృప్తిగా ఉంది, కాని ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలీలేదు. ముప్పై అయిదేళ్లక్రితం తాతగారు అన్న మాట జ్ఞాపకం వచ్చింది.

ఆరోజుల్లో వాళ్ల నాన్నగారు తనని సెయింటాంథోని స్కూల్లో వేయడం తాతగారికి నచ్చలేదు.

''ఈరోజుల్లో ఇంగ్లీషుభాషకున్న గౌరవం తెలుక్కి లేదు. ఇంగ్లీషు రాకపోతే ఉద్యోగాలు దొరకవు. అడుక్కుతినాలి వాడు'' అన్నది నాన్నగారి వాదన.

''సరే, బతుకుతెరువు కోసం ఇంగ్లీషు చదువు. జాతిపరువు నిలబెట్టడానికి తెలుగు నేర్చుకో'' అని తాతగారు, తెలుగు పుస్తకం తనముందు పడేసి, ''మొదలెట్టు, తల్లీ నిన్ను దలంచి ...'' దాదాపు హుంకరించినంత పని చేసి.

గౌరీపతి భగవంతంవేపు తిరిగి, ''నీకు  జ్ఞాపకం ఉందా ఆ పద్యం? తల్లీ నిన్ను దలంచి పద్యం పుస్తకమున్ చేతన్ బూనితిన్... ఎంత కొట్టుకున్నా ఆతరవాత పాదం గుర్తు రావడం లేదు,'' అన్నాడు.

''నాకూ జ్ఞాపకం లేదు'' అన్నాడు భగవంతం నిట్టూరుస్తూ.

(ఏప్రిల్ 2005)